సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



అధికారిక 'దత్తత' సేఫ్

అధికారికంగా పిల్లలను దత్తత తీసుకోవడమే శ్రేయస్కరమని శిశుసంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. - 2లో



ఆత్మ రక్షణకు కరాటే దోహదం : జేసీ

కరాటే విద్య ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. - 2లో

నేడు పార్వతీపురంలో జగనన్నకు చెబుదాం

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పార్వతీపురం మండలంలో శుక్రవారం నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయంలోని సెల్లార్ సమావేశ మందిరంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించాలన్నారు.

న్యూస్‌రీల్

14నుంచి సహకార వారోత్సవాలు



సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: అఖిల భారత సహకార వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. సహకారశాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సన్యాసినాయుడు, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతం



పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కృతజ్ఞతలు తెలిపారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో గురువారం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు, వివిధ నామినేటెడ్ పదవులు పొందినవారు, అభిమానులందరూ సభకు హాజరుకావడం అభినందనీయమన్నారు. ఇదే ఉత్సాహం, ఐక్యతతో రానున్న ఎన్నికల్లో విజయదుందుభి మోగిద్దామన్నారు.

జగనే కావాలి

సంక్షేమ, అభివృద్ధి పాలన సాగాలంటే...

- అన్ని మండలాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'
- లబ్ధిదారులకు జరిగిన మేలు, అభివృద్ధిపై ప్రదర్శన
- జరుగుతున్న మంచిని ఆధారాల సహా వివరణ
- మంచి చేస్తున్నాం.. మద్దతుగా ఉండాలని కోరుతున్న ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సంక్షేమం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఒక సచివాలయం పరిధిలో ఎంత మందికి మేలు జరిగింది?

విద్య: ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'నాడు-నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో వచ్చిన మార్పులేమిటి? ఇంగ్లిష్ మీడియం, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ట్యాబ్‌ల వంటి అదనపు హంగులతో విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులేమిటి?

వైద్యం: విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు కలుగుతున్న ఆరోగ్యభరోసా?

వ్యవసాయం: రైతుభరోసా కేంద్రం ఏర్పాటుతో అందుబాటులోకి విత్తనాలు, ఎరువులు, ప్రతి ఎకరాలోని పంటల ఈ-క్రాప్, అర్హత ఉన్న ప్రతి రైతుకూ ఏటా పెట్టుబడి సాయం, ఒకవేళ ప్రకృతి విపత్తులతో నష్టపోతే పరిహారం, సున్నావడ్డీ రుణాలు ఎలా అందుతున్నాయి?

పౌరసేవలు: సచివాలయం ద్వారా సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు, పరిపాలనలో విప్లవాత్మక మార్పులు ఎలా సాధ్యమయ్యాయి?

శాశ్వత అభివృద్ధి: గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్‌కు పక్కా భవనాలతో పాటు గడపగడపకూ మన ప్రభుత్వం (జీజీఎంపీ) ద్వారా గుర్తించి ప్రాధాన్యత కార్యక్రమాలకు చేసిన ఖర్చుతో శాశ్వత అభివృద్ధి పనులు ఏవిధంగా పూర్తయ్యాయో?

ఇలా ఒకటేమిటి ప్రజలకు చేసిన మంచి ఏమిటో ప్రతిదీ ఆధారాలతో చూపించడానికి తలపెట్టిన కార్యక్రమమే 'వై ఏపీ నీడ్స్ జగన్'. ఒక సచివాలయం యూనిట్‌గానే ఇంత మంచి చేసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మన రాష్ట్రానికి ఎంత అవసరమో ఘంటాపథంగా చెప్పడమే దీని ఉద్దేశం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కో సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించారు. ప్రతి ఇంటికి ఎంత మేలు జరిగిందో, సంక్షేమ పథకాలతో గ్రామాల వారీగా ఎంతమేర ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), నాన్ డీబీటీ ద్వారా ఎంతమందికి, ఎంత మేర మేలు జరిగిందో వివరించారు. అందుకు సంబంధించి ఆధారాలతో ఫ్లెక్సీలో ప్రదర్శించారు.



కురుపాంలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



సీతంపేటలో అభివృద్ధి, సంక్షేమపథకాల వివరాలతో కూడిన డాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి



పార్వతీపురం మేదరవీధిలో వైఎస్సార్‌సీపీ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

99 శాతం హామీలు అమలు

ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలుచేసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కావాలో, 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోనే ఆన్‌లైన్ నుంచి మాయం చేసేసిన చంద్రబాబు కావాలో ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా కురుపాం సచివాలయం-2లో ఏర్పాటు చేసిన సంక్షేమ, అభివృద్ధి బోర్డును పరిశీలించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు.

విప్లవాత్మక పాలన

విప్లవాత్మక పాలనతో నాలుగున్నరేళ్లుగా ప్రతి ఇంటికి, ప్రతీ పౌరుడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరించాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. పార్వతీపురం పట్టణంలోని మేదరవీధి జంక్షన్ సచివాలయంలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్తు

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని సీతంపేట మండల కేంద్రంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న లబ్ధిపై అవగాహన కల్పించారు. డాష్ బోర్డును ఆవిష్కరించారు.

ఆచరణలో సాధికారత

- బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే..
- నేడు పార్వతీపురంలో సామాజిక సాధికార బస్సుయాత్ర

పార్వతీపురం: బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంతో పాటు గ్రామస్థాయి నుంచి మంత్రి పదవుల కేటాయింపులో వెనుకబడిన వర్గాలకు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికప్రాధాన్యమిస్తోంది. ఇతర రాజకీయ పార్టీలవలే ఎన్నికల వేళ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓటు బ్యాంకును వాడుకొని విస్మరించకుండా సామాజిక రాజకీయ సాధికారతకు పెద్దపీట వేస్తోంది. బ్యాక్ వర్డ్ కేస్ట్‌ను...బ్యాక్‌బోన్ కేస్ట్‌గా మార్చి చూపించింది. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరులు అనే మాటను ఆచరణలో చూపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా శుక్రవారం పార్వతీపురంలో సామాజిక, సాధికారత బస్సుయాత్రను నిర్వహించనుంది.

మంత్రి పదవుల్లో...

పార్వతీపురం మన్యం జిల్లాలో నామినేటెడెడ్ పదవుల కేటాయింపులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారు. డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర కేబినెట్‌లో కొనసాగుతున్నారు. ఇదే జిల్లాలో గిరిజన తెగకు చెందిన పాముల పుష్పశ్రీవాణి రెండున్నరేళ్లపాటు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా కొనసాగారు. దళిత వర్గానికి చెందిన జమ్మాన ప్రసన్నకుమార్‌కు ఏపీ టిడ్కోచైర్మన్‌ను పదవిని ఇచ్చారు. కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా మామిడి శ్రీకాంత్, దాసరి కార్పొరేషన్ చైర్మన్‌గా రంగుముద్రి రమాదేవి, ఎస్సీ కమిషన్ సభ్యురాలుగా సవరపు జయమణి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎస్. తిరుపతిరావు (సీతానగరం మండలం), డీసీఎంఎస్ డైరెక్టర్‌గా జొన్నాడ శ్రీకాంత్ (సీతానగరం మండలం), జెడ్పీటీసీగా మామిడి బాబ్జి (సీతానగరం మండలం), పార్వతీపురం మున్సిపల్ చైర్మపర్సన్‌గా బోను గౌరీశ్వరీ, వైస్ చైర్మన్లుగా కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, పార్వతీపురం ఎంపీపీగా మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలుగా బంకురు రవికుమార్, సిద్దా జగన్నాథరావు, జెడ్పీటీసీగా బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్‌గా భాగ్యశ్రీ, తెలకల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా చెవిటి వెంకటరమణ, కళింగ వైశ్య రాష్ట్ర డైరెక్టర్‌గా మెహర్ ప్రసాద్, బలిజిపేట ఎంపీపీగా గుడివాడ నాగమణి, వైస్ ఎంపీపీలుగా వెలిది సాయిరాం, బెవర హేమలత, జెడ్పీటీసీగా అలజంగి రవికుమార్ పదవులను నిర్వహిస్తున్నారు.



బస్సుయాత్ర సభా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

3 గంటలకు బస్సుయాత్ర

నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గలకు చేసిన మేలును వివరించడమే ప్రధాన ఎజెండాగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సుయాత్ర శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురంలో జరగనుంది. సభా ఏర్పాట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పూర్తయ్యాయి. సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. బస్సుయాత్రలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూశాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, విశ్వాసరాయి కళావతి తదితరులు పాల్గొననున్నారు.

రూట్ మ్యాప్...

- ఉదయం 10.30 గంటలకు సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామంలో విలేకరుల సమావేశం
- అనంతరం కాశయ్యపేట గ్రామ సచివాలయ సందర్శన
- సీతానగరం మండలం అప్పయ్యపేట గ్రామంలో మధ్యాహ్న భోజన విరామం
- మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురం పాతబస్టాండ్ కూడలిలో బహిరంగ సభ

క్లుప్తంగా

కబడ్డీ పోటీలకు జేఎన్‌టీయూ జట్టు



ఎంపికైన క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: కాకినాడలో గురువారం నుంచి జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) జట్టు సభ్యుల పేర్లను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె వెంకటసుబ్బయ్య గురువారం విడుదల చేశారు. విజ్ఞాన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ కళాశాల దువ్వాడలో ఇటీవల జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. జట్టుకు ఎంపికైన వారిలో కె.లోకేష్, ఆర్.విష్ణువర్ధన్, ఎం.శ్రీనివాసులు, ఈ.గుణ సాయి, కిషోర్ (విజ్ఞాన కాలేజీ), కె.అశోక్, ఎ.శివమణికంఠ, ఎస్.రామ్‌చరణ్ (రఘు కాలేజీ), డి.రవి (అవంతి కాలేజీ), బి.విజయ్ (ఎన్ఎస్ఆర్ఐటీ), టి.సూర్యవివేక్ (జేఎన్‌టీయూ జీవీ), కె.తేజ (డైట్ కాలేజీ) ఉన్నారు.

వ్యక్తికి నాలుగేళ్ల జైలు

బొబ్బిలి: పట్టణంలోని వెలమ వీధికి చెందిన విక్రమ్ ఏసు స్థానికంగా ఉన్న ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో అప్పటి ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి అక్టోబర్19, 2019న కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి, నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పీపీ శంకరరావు వాదనలు వినిపించారు. సాక్షులను హెచ్‌సీ స్వామినాయుడు ప్రవేశ పెట్టారని బొబ్బిలి పోలీసులు తెలిపారు.

మందుగుండు అక్రమ సామగ్రి స్వాధీనం

బాడంగి: మండల కేంద్రంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన దీపావళి మందుగుండు సామగ్రిని స్థానిక పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఉల్లి సత్తిబాబు ఇంటి వద్ద నిల్వ చేసిన సుమారు రూ.81వేల విలువ గల 60 రకాల మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులకు అందిన సమాచారం మేరకు తెర్లాం ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ కొండలరావు, సిబ్బంది దాడి చేసి సామగ్రిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు బాధ్యులైన పూసర్ల వెంకట సత్యనారాయణ, ఏటూరి గణేష్, ఉన్న నగేష్‌లను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్టు చెప్పారు. ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలువురికి గాయాలు

విజయనగరం క్రైమ్: స్థానిక పూల్‌బాగ్ ఫారెస్ట్ కార్యాలయం సమీపంలో బొలెరో, పల్సర్ బైక్, ఆటో ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు గురువారం రాత్రి టూటౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి నెల్లిమర్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఆటోను క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొంది. ఆటో తిరగబడింది. ఆటోలో ఉన్న వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బైక్‌పై వచ్చిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు అంబులెన్స్‌లు సంఘటనా స్థలానికి వచ్చాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ పేర్కొన్నారు.

కొండగూడేంలో భారీ దొంగతనం

సంతకవిటి: మండల పరిధిలోని కొండగూడేం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కెంబూరు సూర్యారావు ఇంట్లో బుధవారం రాత్రి భారీ దొంగతనం జరిగినట్టు ఎస్ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. సూర్యారావు కుటుంబం బుధవారం సాయంత్రం అయ్యవారిపేటలో బంధువుల నూతన గృహ ప్రవేశానికి వెళ్లారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకునేసరికి కిటికీ పగులుగొట్టి ఉండడంతో, దొంగతనం జరిగిందని బాధితులు ఫోన్ చేయడంతో గ్రామానికి సిబ్బందితో చేరుకున్నామని, రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన దొంగలు కిటికీ అద్దం పగులుకొట్టి, గ్రిల్స్‌ను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారన్నారు. బెడ్‌రూం డోర్ తాళాలు కూడా పగులగొట్టి, లోపల ఉన్న బీరువాను తెరచి అందులో ఉన్న ఆరుంపావు తులాల బంగారం, 30తులాల వెండి, కొంత నగదును దోచుకెళ్లారని వెల్లడించారు. రాజాం సీఐ ఎస్.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹102	₹174	₹184

అధికారిక 'దత్తత' సేఫ్

పిల్లలను చట్ట ప్రకారం మాత్రమే దత్తత తీసుకోవాలి. దీని వల్ల దత్తత వెళ్లిన పిల్లలకు పూర్తి హక్కులు లభిస్తాయి. ఏదైనా సమస్య వస్తే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించవచ్చు.

- అనధికారిక దత్తత చట్టరీత్యా నేరం
- జిల్లాలో నెల రోజులు పాటు జాతీయ దత్తత మాసోత్సవాలు
- ఇప్పటి వరకు 50 మంది పిల్లలు దత్తత
- వీరిలో ముగ్గురు విదేశాలకు దత్తత



దత్తత పత్రాన్ని తల్లిదండ్రులకు అందజేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: అనధికారిక దత్తత చట్ట రీత్యా నేరమని చెప్పినా కొందరు ఇంకా ఆ పద్ధతిలోనే దత్తత తీసుకుంటున్నారు. ఇటువంటి దత్తత వల్ల పిల్లలకు భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో దత్తతపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు దత్తత మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. నవంబర్ 1 నుంచి 30 వరకు ఈ మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. దత్తత ఏ విధంగా పొందాలి. దత్తత తీసుకోవడానికి ఉండాల్సిన అర్హతలు గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నారు. జాతీయ దత్తత మాసోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించనున్నారు.

నెల రోజుల కార్యక్రమాలు ఇలా...

దత్తతపై పోస్టర్లు ముద్రించి వాటి ద్వారా అవగాహన కల్పించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, పీహెచ్‌సీల వద్ద దత్తత గురించి అవగాహ న సదస్సులు నిర్వహించి అవగాహన కలిస్తారు. అదే విధంగా స్వచ్ఛంద సంస్థలతో సమన్వయ స మావేశాలు నిర్వహించి దత్తత గురించి చెబుతారు. బాలసదన్‌లు, చిల్డ్రన్‌హోంల్లో ఉన్న ఆరు నుంచి 18 ఏళ్లలోపు అనాథ పిల్లలను దత్తత వెళ్లాలని కౌన్సెలింగ్ ఇస్తారు. నవంబర్ 14 నుంచి జరిగే జాతీయ బాలల వారోత్సవాల్లో కూడా అధికారికంగా దత్తత తీసుకోవడంపై అవగాహన కల్పిస్తారు.

50 మంది దత్తత

2011లో అనాథ శిశువుల సంరక్షణ కోసం జిల్లాలో శిశుగృహను ఏర్పాటు చేసారు. ఇక్కడ సంరక్షించబడే పిల్లలు అంతా ఆరేళ్లలోపు వారే. ఇక్కడ సంరక్షించబడిన వారిలో ఇప్పటి వరకు 50 మందిని పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చారు. వీరిలో ముగ్గురు పిల్లలను విదేశాలకు, 47 మందిని మన దేశంలో పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చారు.



వన్ స్టాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఊయల

అనధికార దత్తత చెల్లదు

కొందరు ఇప్పటికీ బంధువులకు చెందిన పిల్లలను, తెలిసిన వారి పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటున్నారు. ఇలా అనధికార దత్తత చెల్లదు. ఎటువంటి హక్కులు పొందలేరు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు తర్వాత పిల్లలు పుడితే వీరిని నిర్లక్ష్యం చేస్తే న్యాయ పోరాటం చేయడానికి అవకాశం ఉండదు. అధికారిక దత్తత ఇచ్చినప్పుడే పిల్లలు పుట్టే అవకాశం లేదని వైద్యుని దగ్గర నుంచి సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతే దత్తత ఇస్తారు. దీని వల్ల వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు. చట్ట పరంగా దత్తత ఇస్తారు కాబట్టి ఏ సమస్య వచ్చినా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. అనధికార దత్తత తీసుకున్న వారికి జేజే యాక్ట్ సెక్షన్ 81 ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ఆస్పత్రుల వద్ద ఊయలలు

ఎవరైనా తమకు పిల్లలు అక్కర్లేదుకుంటే చెత్తకుండీలు, రోడ్డు పక్కన తుప్పల్లో పడేస్తుంటారు. ఆ విధంగా పడేయడంతో శిశువులు మరణిస్తున్నారు. పిల్లలు అక్కర్లేదుకునేవారు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఊయలలో వేస్తే వారిని సంరక్షించి అధికారికంగా దత్తత ఇస్తారు. ఇందు కోసం ఘోషాస్పత్రి, వన్ స్టాప్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఊయలలను ఏర్పాటు చేసారు.

నెల రోజులు సదస్సులు, సమావేశాలు



పిల్లలను అధికారికంగా దత్తత తీసుకోవడంపై నెల రోజుల పాటు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నాం. అనధికారికంగా దత్తత తీసుకోవడం చట్ట రీత్యా నేరం. ఎవరైనా తీసుకుంటే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. చట్ట ప్రకారం దత్తత తీసుకోవడం మంచిది.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

దత్తతకు కావాల్సిన ధ్రువపత్రాలు

పిల్లలు దత్తత కావాలంటే ముందుగా పాన్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. బిడ్డను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తమ పాన్ కార్డుతో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కారా. ఎన్ఐసి. ఇన్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎకనాలెడ్జ్ మెంట్ ప్రింట్ తీసుకోవాలి. ఫ్యామిలీ ఫొటో (మ్యాక్సీ సైజు), ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, పాస్ పోర్టు, కరెంటు బిల్లులో ఏదో ఒక నివాస ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఏడాదికి రూ.2 లక్షలకు తగ్గకుండా) తహసీల్దార్ నుంచి తీసుకున్న సర్టిఫికెట్, ఉద్యోగులు అయితే శాలరీ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రులిద్దరివీ పుట్టిన ధ్రువీకరణ పత్రాలు, నోటరీ నుంచి పుట్టిన తేదీ అఫిడవిట్, తల్లిదండ్రులు ఇద్దరివి హెచ్ఐవీ, వీడీఆర్, హెపటైటీస్ బీ, టీబీ(స్పూటమ్), ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలి.

ఆత్మ రక్షణకు కరాటే దోహదం : జేసీ

- జోగింపేటలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న జేసీ గోవిందరావు, చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు



13 జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు

సీతానగరం: కరాటే విద్య ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభ విద్యాలయంలో 67వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను గురువారం ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డీఈఓ ప్రేమకుమార్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాలకు చెందిన 600 మంది కరాటే పోటీల్లో పాల్గొనేందుకు మన్యం జిల్లా జోగింపేటకు రావడం అభినందనీయమన్నారు. క్రీడలో ఓటమి సహజమని, ఓటమితోనే విజయానికి మెట్లు నిర్మించాలన్నారు. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ కరాటే వ్యాయామ విద్యనభ్యసించే వ్యక్తి ఆత్మ రక్షణకు, పలువురి రక్షణకు ఉపయోగపడుతుందని, వ్యాయామ క్రీడాకారులకు ప్రభుత్వ కొలువుల్లో నియామకాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న క్రీడల్లో పాఠశాలలతో పాటు తల్లిదండ్రులు కీర్తిప్రతిష్టలు సంపాదించి పెట్టాలని కోరారు. డీఈఓ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు అండర్ 14, 17, 19 బాలురు, బాలికలకు సంబంధించి జరగనున్న పోటీల్లో 600 మంది పాల్గొననున్నట్టు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాలైన వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సింహాచలం, ఎంఈఓ సూరిదేముడు, ఎంపీరమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రీయల్ పార్కుకు ప్రోత్సాహకాలు

సాక్షిప్రతినిధి,విజయనగరం: విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రీయల్ పార్కు లిమిటెడ్‌కు పలు రాయితీలను ప్రకటిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్‌ఎంఈ పార్కులో అల్యూమినియం రిఫనరీ కాంప్లెక్స్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా సంస్థ ముందుకొచ్చింది. రూ.531.36 కోట్లు పెట్టుబడితో 1,166 ఎకరాల్లో ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రభుత్వం ఇదివరకే అనుమతులు ఇచ్చింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా పెద్దమొత్తంలో పెట్టుబడితో ప్రాజెక్టు నిర్వహణకు ముందుకొచ్చిన నేపథ్యంలో దీనిని ప్రోత్సహించేలా ఇండస్ట్రీయల్ డవలెప్‌మెంట్ -2023-37 పాలసీ మేరకు రాయితీలను ఇచ్చేలా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపి, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రభుత్వానికి నివేదించింది. వీటిలో కొన్నింటికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇండస్ట్రీయల్ పార్కు వరకు విద్యుత్, నీటి సరఫరాకు అనుమతి ఇస్తూ, ఇందుకు సంబంధించిన వ్యయాన్ని సంస్థ వెచ్చించాలని సూచించింది. 33 శాతం మించకుండా రెసిడెన్షియల్/కమర్షియల్ నిర్మాణాలు చేసుకునేలా, అదే విధంగా ఐడీపీ 2023-37 పాలసీ మేరకు ఇతర ప్రోత్సాహకాలు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిశోధనలు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: పరిశోధనలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో పరిశోధన అనే అంశంపై గురువారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. పరిశోధనలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పరిశోధనలు ఏ విధంగా చేయాలి, జర్నల్స్ ఏ విధంగా పబ్లిష్ చేయాలి వంటి వాటిపై వివరించారు. సమాజంలో కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్న సందర్భాల్లో వాటిని అరికట్టేందుకు అవసరమైన వాటిపై పరిశోధనలు జరగాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని, ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌బాబు, ఫామకాలజీ హెచ్ఓడీ డాక్టర్ అన్నపూర్ణ, మైలాన్ జనరల్ మేనేజర్ విజయభూషణం , మిమ్స్ వైద్య కళాశాల ఎనస్తషీయా విభాగం వైద్యులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సాలూరు: మండలంలో పీఎస్ బొడ్డవలస అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జనార్దన్‌సాయి డిసెంబర్‌లో రాజస్తాన్‌లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీరాములు గురువారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు ఒంగోలు, ప్రకాశం జిల్లాల్లో జరిగిన అండర్ 17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జట్టు తృతీయ స్థానంలో నిలవగా, జట్టులో ఉన్న జనార్దన్‌సాయి ప్రతిభ కనబర్చాడని తెలిపారు. జనార్దన్‌సాయిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు అధికారులు ప్రకటించారని పేర్కొన్నారు. విద్యార్థిని పీడీ విద్యాసాగర్, పీఈటీ నాయుడు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు లిఖిత్



కోచ్‌తో జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన లిఖిత్

విజయనగరం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నగరానికి చెందిన ఆర్.లిఖిత్ అర్హత సాధించాడు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన అండర్ - 19 బాల, బాలికల స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.లిఖిత్ ఆ పోటీల్లో కాంస్య పతకం దక్కించుకోవటంతో పాటు ఈ నెల 20వ తేదీ నుంచి జమ్ముకశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించటం విశేషం. ప్రస్తుతం నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న లిఖిత్ ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. తాజాగా అండర్ - 19 స్కూల్ గేమ్స్ జాతీయ పోటీల్లో సత్తా చాటాలని కోచ్ డి.వి.చారిప్రసాద్ ఆకాంక్షించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో గల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి టీవీఎస్ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సమస్యలపై 99592 25621 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి : జేసీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: గృహ నిర్మాణం, ప్రాధాన్యత భవనాలు సకాలంలో పూర్తి చేసేందుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, రీసర్వే, జగనన్న పాలవెల్లువ, వికాష్ భారత్ సంకల్పయాత్ర, పంచాయతీ రాజ్ పనులు, తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ప్రాధాన్యత భవనాలను పూర్తి చేసి అప్పగించాలని, ప్రతీ వారం 25శాతం చొప్పున్న భవనాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్ తదితరులున్నారు.


కమ్యూనిటీ పారా మెడికల్ సిబ్బంది నూతన కార్యవర్గం



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: కమ్యూనిటీ పారా మెడికల్ - ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో జరిగింది. ఎన్నికను రాష్ట్ర అధ్యక్షుడు టి.ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు సమక్షంలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నాగిరెడ్డి సింహాచలం ఉపాధ్యక్షుడిగా వానపల్లి శంకరరావు, కార్యదర్శిగా నడిమింటి గోపాలనాయుడు, సహాయ కార్యదర్శిగా బి.వి.రమణ, కోశాధికారిగా తులసీదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారికి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, వివిధ మండలాల సభ్యులు అభినందించారు. అనంతరం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు హెల్త్ కేర్ ప్రొవైడర్స్ నిర్వహించవలసిన విధి విధానాలను తెలియజేశారు.

మా కష్టాలు చూడండి సారూ..



కట్టెలు మోస్తున్న విద్యార్థులు



వంట చేస్తున్న విద్యార్థులు




యండభద్ర గిరిజన సంక్షేమ పాఠశాల

చిత్రాల్లో కట్టెలు తెచ్చి.. వంట చేస్తున్నది కొమరాడ మండలం యండభద్ర గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థులు. వసతిగృహంలో 78 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మెనూ అంటూ ఉండదు. వండి వడ్డించేవారు ఉన్నా పట్టించుకోరు. వసతిగృహ అధికారుల నిర్లక్ష్యం వీరికి శాపంగా మారింది. ఉదయాన్నే మేల్కొనడం, కట్టెలు తెచ్చి వంట చేసుకోవడం, గెంజి అన్నం తిని పాఠశాలకు వెళ్లడం దినచర్యగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు కూడా సరిగా రావడంలేదని చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కష్టాలు తీర్చాలని, భోజనం వడ్డించేలా చూడాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.!

– కొమరాడ

గిరిజనుడి హత్య!



మృతి చెందిన గిరిజనుడు అర్జున్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ అడ్డతీగ గ్రామం వద్ద గురువారం సాయంత్రం గిరిజన యువకుడు హత్యకు గురైనట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై స్థానిక పోలీసులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. మృతుని భార్య ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం గుమ్మ గ్రామానికి చెందిన పాంగి అర్జున్(38) మండలంలోని కొత్తఅడ్డతీగ గ్రామంలో భార్యాబిడ్డలతో నివసిస్తున్నాడు. గత కొంత కాలంగా గ్రామానికి దగ్గరలో ఉన్న అనాథాశ్రమంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6గంటల సమయంలో గ్రామానికి సమీపంలో అర్జున్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో గుండెలపై రెండుచోట్ల లోతైన గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొలుత గుర్తించి అర్జున్ భార్య కాంతానికి సమాచారం ఇచ్చాడు. ఆమె పరుగున వెళ్లి భర్తతో మాట్లాడగా అడ్డతీగ వాళ్లు కొట్టారని చెబుతుండగా ఆయన మాట ఆగిపోయింది. భార్య వెంటనే గ్రామంలోకి వచ్చి చెప్పగా 108లో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అర్జున్ మృతి చెందినట్టు వైద్యులు చెప్పడంతో భార్య కన్నీరుమున్నీరవుతోంది. అర్జున్ భార్య ఐదు నెలలు గర్భిణి కాగా, ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. అర్జున్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.